క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలకు భూములివ్వాలి


అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య

బొబ్బిలి: ఎస్సీ, ఎస్టీలకు ఇస్తానన్న భూములు తక్షణమే ఇవ్వాలని అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు ఎస్సీ, ఎస్టీల్లోని ప్రతీ కుటుంబానికి మూడు ఎకరాల భూమిని ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎన్టీ రామారావు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారని, ఆయన నుంచి పార్టీని లాక్కున్న చంద్రబాబు మాత్రం ఆ రిజర్వేషన్లు తీసేసి అన్యాయం చేసేందుకు చూస్తున్నారని విమర్శించారు. మద్యం షాపుల్లో 15 శాతం షాపులను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని కోరారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకోలేని దుస్థితిలో ప్రభుత్వం

బొబ్బిలి: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కూడా జరుపుకోలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం విచారకరమని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ అన్నారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. అమరజీవి పొట్టిశ్రీరాములు పోరాట ఫలితంగా మద్రాసు రాష్ట్రం నుంచి మన రాష్ట్రం ఏర్పడిందని, అటువంటి విశిష్టత కలిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి


మాట్లాడుతున్న సీపీఎం నేత సూర్యనారాయణ

బొబ్బిలిరూరల్: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, పి.శంకరరావులు డిమాండ్ చేశారు. మండలంలోని రంగారాయపురంలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ మహాసభకు హాజరైన వారు.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీల బాదుడు ఉండదని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ చార్జీలు పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరల భారంతో సామాన్య ప్రజలు విలవిలలాడుతున్నారని, అది చాలదన్నట్లుగా ఇప్పుడు విద్యుత్ చార్జీల పెంపు ఏంటని ప్రశ్నించారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకం వేతనదారులకు 200 పనిదినాలు కల్పించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందివ్వాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని కోరారు.


వాటర్‌పైపుల దగ్ధం

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని పాలకొండ రోడ్డులో ఉన్న సత్య కాంప్లెక్స్ దగ్గర గురువారం రాత్రి దీపావళి సందర్భంగా కాల్చిన క్రాకర్స్ నిప్పులు పడి ఓ దుకాణంలోని వాటర్‌పైపులు దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. 6 వేల మీటర్ల రెండు ఇంచీల పైపులు కాలిపోయాయని ఫైర్ ఎస్ఐ టీఎస్ఎస్ జనార్దనరావు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందన్నారు.

విచారణ చేయండి

బొబ్బిలి: మండలంలోని అలజంగి వీవోఏ పరిధిలోని 108 డ్వాక్రా సంఘాలకు సంబంధించి, రూ.కోటికు పైగా నిధుల్లో జరిగిన అవకతవకలపై వెంటనే ఉన్నతాధికారులతో విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మువ్వల శ్రీనివాసరావు, పలువురు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను శుక్రవారం కలిసి మాట్లాడారు. డ్వాక్రా సంఘాలకు చెందిన మార్జిన్ మనీ, రుణాలు, వడ్డీ రాయితీ సొమ్ము పక్కదారి పట్టిందని, దీనిపై విచారణ చేయించాలని కోరారు. విచారణ చేయిస్తామని ఆయన బదులిచ్చారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి


ఎంపీడీవో రత్నంతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రత్నంతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. గ్రామాల అభివృద్ధితో పాటు తాగునీటికి అధిక ప్రాధాన్యమివ్వాలని కోరారు. అలాగే గ్రామాల్లో పరిశుభ్రతపై కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చివరికి చేతులెత్తేశారు!

- సాగునీటి కాలువల ద్వారా వరి పంటకు అందని నీరు
- కాలువ శివారు ఆయకట్టు ప్రాంతాల్లో ఎండిపోతున్న పంట
- ఇలా అయితే అపరాల సాగు కష్టమే..
- తోటపల్లి, మడ్డువలస ఆయకట్టులో పర్యవేక్షణ శూన్యం
- అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం


రాజాం మండలంలోని ఆగూరులో నీరు లేక ఎండిపోతున్న వరి పంట

రాజాం: ఖరీఫ్ చి'వరి' ఆశలపై అటు వరుణుడు ఇటు అధికారులు నీళ్లుచల్లారు. ఓవైపు మేఘాలు ఏర్పడినట్లే ఏర్పడి ముఖం చాటేయగా, మరోవైపు సాగునీరు అందించాల్సిన అధికారులు పంట ఆఖరి దశలో చేతులెత్తేశారు. ప్రస్తుతం వర్షాలు అంతగా లేకపోవడంతో సాగునీటి కోసం చెరువులు, కాలువలపైనే రైతులు చాలావరకు ఆధారపడ్డారు. ప్రధానంగా రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లోని పంటపొలాలకు తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల కాలువల ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. ముఖ్యంగా వరి పంట పొట్టదశ నుంచి హారం కట్టే సమయంలో దుబ్బుకు నీరు అందితే హారంలో ధాన్యం గట్టిపడి గింజ పరిణామం పెరుగుతుంది. ఫలితంగా పొల్లు తగ్గి నాణ్యమైన ధాన్యం ఉత్పత్తి అవుతాయి. అయితే సరైన సమయంలో అటు సాగునీటి కాలువల అధికారులు చేతులెత్తేయడం, ఇటు సాగునీటి చెరువుల్లో కూడా నీరు ఇంకిపోవడంతో వరి సాగుకు కావాల్సిన చివరి తడి(నీరు) అందలేదు. ఫలితంగా ధాన్యం హారంలో నాణ్యత లోపించడం, పంటలు ఎండిపోవడం జరిగాయి. సరిగ్గా పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు.


సంతకవిటి మండలంలోని సిరిపురంలో ఇంజిన్ సాయంతో వరి సాగుకు నీరందిస్తున్న రైతు

ఎవరూ పట్టించుకోవడం లేదు..



గత ప్రభుత్వ హయాంలో అధికారులు అందుబాటులో ఉండేవారు. సాగునీటి కాలువల ద్వారా నీరు రాకపోయినప్పుడు సచివాలయంలో ఫిర్యాదు చేస్తే చాలు అధికారులు గ్రామాల్లోకి వచ్చేవారు. ఇప్పుడు పట్టించుకునే వారే లేరు. మా గ్రామంలోని పంటపొలాలకు తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. పట్టించుకునే నాథుడే లేడు. రబీ సీజన్‌లో ఏ పంటలు వేయాలో కూడా ఇంతవరకు చెప్పలేదు.

–కోనారి అప్పారావు, వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు, రాజాం.

ప్రతీ మండలంలో..

నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 52 వేల ఎకరాల మేర వరి పంట సాగులో ఉంది. ప్రస్తుతం ఈ పంట కోతదశకు వచ్చింది. ఈ సమయంలో పొలంలో నీరు విడిచిపెట్టడం ద్వారా హారం ఎక్కువగా వస్తుంది. మరోవైపు మినప, పెసర, ఉలవ వంటి అపరాల విత్తనాలు పొలాల్లో జల్లుకునే అవకాశం ఉంది. రాజాం మండలంలో ఆగూరు, కంచరాం, దోసరి, అంతకాపల్లి, పొగిరి తదితర గ్రామాల్లో తోటపల్లి కాలువ నీరు రాలేదు. ఈ ప్రాంతాల్లో చివరి తడి లేక పంటలు కళావిహీనంగా మారాయి. సంతకవిటి మండలంలో సిరిపురం, జీఎస్‌పురం, శేషాద్రిపురం, గోవిందపురం, సురవరం, బలరాంపేట, చిన్నయ్యపేట, రంగారాయపురం తదితర గ్రామాలకు మడ్డువలస, తోటపల్లి కాలువల నీరు చేరలేదు. రేగిడి మండలంలో వన్నలి, అంబఖండి, సోమరాజుపేట, చాటాయివలస తదితర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వంగర మండలంలో తూతూమంత్రంగానే సాగునీటి కాలువల ద్వారా సీజన్‌లో సాగునీరు అందింది. చెరువుల ఆధారంగానే ఈ మండలంలో ఈ ఏడాది పంటలు పండించారు. ప్రతీ మండలంలో చివరి తడికి నీరు లేక పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

అధికారుల సలహాలేవీ?

రాజాం మండలంలో గత వారం రోజులుగా వ్యవసాయ శాఖ ఏవో రేనుకాసాయి లేరు. ఆమె సెలవుల్లో ఉండగా, ఇన్‌చార్జ్ ఏవోగా సంతకవిటి ఏవో నవీన్‌ను వేశారు. ఈయన కూడా ఇక్కడకు రావడం లేదు. మరోవైపు ఏడీఏ చంద్రరావు కూడా కార్యాలయంలో అందుబాటులో ఉండకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరి సమయంలో దోమపోటు అధికంగా పంటకు ఉండడంతో ఎవరిని సంప్రదించాలో తెలియక సతమతమవుతున్నారు. ఇదే సమయంలో సాగునీటి కొరత కారణంగా కూడా రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాజాం నియోజకవర్గ కేంద్రంలో మడ్డువలస, తోటపల్లి కాలువల కార్యాలయాలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఆయా కార్యాలయాల్లో లేకపోవడంతో రైతులకు చివరి సమయంలో కష్టాలు కన్నీళ్లను తెప్పిస్తున్నాయి. ఇప్పటికే రైతు భరోసా వంటి సాయం లేక వ్యవసాయంపై అయిష్టంతో ఉన్న రైతులకు ఈ చివరి కష్టాలు వ్యవసాయంపై అనాసక్తిని చూపుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

లబ్ధిదారులంతా పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీలో సర్వర్ సమస్య తలెత్తిన కారణంగా కొంతమంది మధ్యాహ్నం వరకు మరికొంతమంది సాయంత్రం వరకు పింఛన్ డబ్బుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండల తీవ్రత కారణంగా ఉక్కపోతతో వృద్ధులు, పెన్షనర్లలోని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో తామెప్పుడూ ఇటువంటి ఇబ్బందులు పడలేదని లబ్ధిదారులు అంటున్నారు.

–రాజాం, బొబ్బిలి, బాడంగి, రేగిడి, వంగర


వంగరలో పింఛన్ డబ్బుల కోసం వేచిచూస్తున్న లబ్ధిదారులు

ఉదయం 6 గంటలకే వచ్చాం..



పింఛన్ల పంపిణీ నిమిత్తం ఉదయం 6 గంటలకే వంగర మండల కేంద్రానికి వచ్చాం. సర్వర్ పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. మొదటి పింఛన్ పంచిన తర్వాత సర్వర్ ఆగిపోయింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు మళ్లీ అవ్వలేదు. ఆ తర్వాత సర్వర్ పనిచేయడంతో పింఛన్ల పంపిణీ చేపట్టాం.

డి.విశాలాక్ష్మి, ఏఎన్ఎం, వంగర


బాడంగి పంచాయతీ కార్యాలయంలో పింఛన్‌ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

ఒంటిగంటకు డబ్బులు అందాయి..



ఉదయం నుంచే పింఛన్ కోసం వేచి చూశాం కానీ మధ్యాహ్నం ఒంటిగంటకు పింఛన్ డబ్బులు అందాయి. సర్వర్ డౌన్ కారణంగా పింఛన్ల పంపిణీ ఆలస్యమని చెబుతున్నారు. గతంలో ఇటువంటి ఇబ్బందులు పడలేదు.

కోడూరు నాగన్నాయుడు, పింఛన్‌దారుడు, వంగర

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద దీపం–2 పథకం ప్రారంభించి, ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా పలువురు లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జ్ మరిశర్ల రామారావునాయుడు, తహసీల్దారు మల్లెపురెడ్డి శ్రీను, ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మద్యం దుకాణం తరలించారు..

బాడంగి: ఎట్టకేలకు మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు పక్కన పలు షాపుల మధ్య నిబంధనలు అతిక్రమిస్తూ నిర్వహిస్తున్న మద్యం దుకాణాన్ని గ్రామానికి దూరంగా శుక్రవారం తరలించారు. పలు వ్యాపార దుకాణాల మధ్య ఆ దుకాణం నిర్వహిస్తుండడంపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఇదే విషయంపై ఈ నెల 31వ తేదీన సాక్షి దినపత్రికలో 'నిబంధనలు బేఖాతరు' పేరిట ఓ వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆ షాపును అక్కడి నుంచి తొలగించి, వేరేచోటకు మార్చేలా చర్యలు తీసుకున్నారు.

ఫీవర్ సర్వే

బొబ్బిలిరూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో ఫీవర్ సర్వే శుక్రవారం చేపట్టారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, జ్వర లక్షణాలతో బాధపడుతున్న పలువురి రక్తనమూనాలు సేకరించి, జ్వర నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో రవికుమార్ పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక

బాడంగి: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. మండల కేంద్రానికి సమీపంలోని ముగడ కాలనీలో నివాసముంటున్న స్థానిక ఎస్‌వీడీ పాఠశాల విద్యార్థి కె.దిలీప్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల సిబ్బంది శుక్రవారం తెలిపారు. సదరు విద్యార్థి త్వరలో కడపలో జరిగే పోటీల్లో పాల్గొంటారు.

మెంటాడ: శ్రీకాకుళంలో ఈ నెల 3, 4వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు మండలంలోని పోరాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.సన్యాసినాయుడు, పీడీ కొల్లి తవిటినాయుడు శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారిలో కె.హేమలత, కె.కీర్తన, టి.సురేష్‌లు ఉండగా, అండర్–17 విభాగంలో అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.


మెంటాడ: పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ఓటర్ల నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలిరూరల్: కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు మల్లెపురెడ్డి శ్రీను తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు గౌరీశంకర్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. కొత్తగా ఓటు హక్కు కావాలనుకునే వారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటరు కార్డులోని మార్పులు, చేర్పులకు కూడా సంబంధిత బీఎల్‌వోను కలిసి దరఖాస్తు అందజేయాలన్నారు. ఓటర్ల నమోదుకు ఈ నెల 9, 23, 24వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. నవంబరు నెల రేషన్ సరుకులకు సంబంధించి, కందిపప్పు, పంచదార రేషన్‌డిపోల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కిలో కందిపప్పు రూ.67, పంచదార రూ.17లకు విక్రయించడం జరుగుతుందన్నారు.

6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి..

వంగర: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి, ఈ నెల 6వ తేదీలోగా అర్హులైన ఉపాధ్యాయులంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు డి.ధర్మరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలో 129 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, ఆన్‌లైన్ ద్వారా గానీ నేరుగా తహసీల్దారు కార్యాలయానికి వచ్చి గానీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

క్లోరినేషన్

వంగర: మండలంలోని తలగాం గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకంలో క్లోరినేషన్ చర్యలు శుక్రవారం చేపట్టారు. సురక్షితమైన తాగునీటిని గ్రామస్తులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈవోపీఆర్డీ కెల్ల రామారావు తెలిపారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు


రామభద్రపురం: ఇంటి ముందు సరదాగా క్రాకర్స్ కాల్చుతున్న చిన్నారులు


బొబ్బిలి: మండల కేంద్రంలో దీపావళి సంబరాల్లో బ్రహ్మకుమారీలు, తదితరులు


సంతకవిటి: శ్రీహరినాయుడు పేటలో దీపాలంకరణలో ముగ్గు

వాడవాడలా గురువారం జరిగిన దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. ఏటా ఆశ్వయుజ శుద్ధ చతుర్దశి నాడు ఈ వెలుగుల పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అదే రోజున సత్యభామ సమేత శ్రీకృష్ణుడు నరకాసురుడిని వధించినందున చెడుపై మంచి గెలిచిందని గుర్తుగా ఈ వేడుకలు జరుపుకోవడం గమనార్హం. ఉదయం పూజల అనంతరం సాయంత్రం చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ క్రాకర్స్ కాల్చుతూ ఆనందంగా గడిపారు. జీవితంలో చెడు అనే చీకటిని పారద్రోలి మంచి అనే వెలుగులు నింపాలని భగవంతుడిని వేడుకున్నారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రాజాం: దీపావళి వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ కుటుంబ సభ్యులు


తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాల వసతిగృహంలో దీపావళి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు


బాడంగి: మండల కేంద్రంలోని ముగడ కాలనీలో క్రాకర్స్ కాల్చుతున్న మహిళ

• ముస్తాబైన ఆలయాలు




పవిత్ర కార్తీకమాసం శనివారం నుంచి ఆరంభం కానుండడంతో పూజలకు ఆలయాలను సరికొత్తగా ముస్తాబు చేశారు. శివుడికి అత్యంత ప్రీతికరమైన ఈ మాసంలో నెలరోజుల పాటు భక్తులు శైవక్షేత్రాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. తొలిరోజు నుంచే మహిళలు కార్తీక స్నానాలు ఆచరించి, భగవంతుడిని భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. ప్రస్తుతం అన్నిచోట్ల ఉన్న మందిరాలను పూజలకు సిద్ధం చేశారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు.

–రాజాం, రాజాం సిటీ, రేగిడి, రామభద్రపురం

• వరి కోతలు ఆరంభం



వరి పంట కోతలు శుక్రవారం ఆరంభమయ్యాయి. రేగిడి మండలంలోని తాటిపాడు, లచ్చన్నవలస, బూరాడ తదితర గ్రామాల్లో వరి కోతలు చకచకా జరుగుతున్నాయి. చేతికి అందివచ్చిన పంట బాగుండడంతో పాటు దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–రేగిడి

• పంటకోత ప్రయోగంపై శిక్షణ



రేగిడి మండలం, సోమరాజుపేట రైతుసేవా కేంద్రంలో వరి సాగులో నిర్వహించాల్సిన పంటకోత ప్రయోగంపై ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ శంకర్ శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ ప్రయోగం ఏ విధంగా చేయాలి, ప్రయోగం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పంట దిగుబడి అంచనా వేసేందుకు ఈ ప్రయోగం చక్కగా ఉపయోగపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

–రేగిడి

• మద్యంషాపు ఎత్తివేయాలని డిమాండ్



బొబ్బిలి పట్టణంలోని మేదరిబంద వద్ద చర్చి, కాన్వెంట్‌లు ఉన్న ప్రాంతంలో మద్యంషాపు నిర్వహిస్తుండడాన్ని అక్కడి వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దుకాణం ఎత్తివేయాలని మహిళలంతా డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల నిరసన చేపట్టగా, ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు స్పందించి, అక్టోబరు నెలాఖరులోగా షాపు తరలించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో శుక్రవారం ఆ ప్రాంత మహిళలు సీఐ కార్యాలయానికి వెళ్లి, సీఐ హామీపై ప్రశ్నించారు. ఆ షాపు ప్రొవిజినల్ లైసెన్స్‌ను నవంబరు 7వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని, తప్పనిసరిగా షాపును అక్కడి నుంచి తొలగిస్తామని మళ్లీ భరోసా ఇచ్చారు.

–బొబ్బిలి